# సాక్షి
## అల్లూరి సీతారామరాజు జిల్లా

సోమవారం, 5, ఆగస్టు, 2024






### నీటి ఏనుగుల కనువిందు

విశాఖ: ఇందిరా గాంధీ జూ పార్కులో ఆదివారం నీటి ఏనుగులు సందడి చేశాయి. హుషారుగా తిరుగుతూ ఆకట్టుకున్నాయి.



### ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు

విశాఖ : సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో రాధాకృష్ణుల విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో అలంకరించి పూజలు చేశారు.



### జనసంద్రంలా తీరం

విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో ఆదివారం పర్యాటక ప్రాంతాలు కిటకిటలాడాయి. సందర్శకులు భారీగా రావడంతో సందడి నెలకొంది.

## న్యూస్‌రీల్

### ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు 6న నోటిఫికేషన్ జారీ

మహారాణిపేట: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక కోసం ఈనెల 6వ తేదీన నోటిఫికేషన్ వెలువడనుంది. ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ పార్టీ మారడంతో ఆయనపై అనర్హత వేటు పడింది. దీంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. మంగళవారం ఎన్నికల అధికారి హోదాలో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ నోటిఫికేషన్ జారీ చేయనున్నారు. అదే రోజు నుంచి నామినేషన్లు స్వీకరిస్తారు. 13వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుంది. 14న స్క్రూట్నీ, 16న నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంటుంది. 30వ తేదీన ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. సెప్టెంబర్ 3న ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరుగుతుంది.

### క్రీడా పోటీల్లో డీఏవీ పాఠశాల విద్యార్థి ప్రతిభ

- అమీర్ బాషాకు రెండు విభాగాల్లో బంగారు పతకాలు



బంగారు పతకంతో అమీర్‌బాషా (మధ్యలో)

పాడేరు: విజయవాడలో నిర్వహించిన డీఏవీ క్లస్టర్ స్థాయి ఆటల పోటీల్లో సీలేరు ఏపీ జెన్‌కో డీఏవీ పాఠశాల విద్యార్థి అమీర్ బాషా రెండు విభాగాల్లో బంగారు పతకాలు సాధించాడు. ఆదివారం ఇబ్రహీంపట్నంలోని వీటీపీఎస్ మైదానంలో జరిగిన అండర్ -17 క్లస్టర్ స్థాయి పోటీల్లో వంద మీటర్లు, రెండు వందల మీటర్లు విభాగంలో ప్రతిభ కనబరిచి బంగారు పతకాలు సాధించాడు. తదుపరి జరుగబోయే రాష్ట్రస్థాయి పోటీలకు కూడా బాషా ఎంపికయ్యాడు. ఈ విద్యార్థి టెన్త్ చదువుతున్నాడు. ఈ సందర్భంగా అతనికి పాఠశాల ఎల్‌ఎంసీ చైర్మన్, ఇన్‌చార్జి ఎస్‌ఈ చంద్రశేఖరరెడ్డి, ఈఈ ప్రభాకర్ అభినందనలు తెలిపారు.

### గంజాయి నివారణకు తనిఖీలు



కందమామిడి జంక్షన్ వద్ద తనిఖీలు

పాడేరు : ఎస్పీ అమిత్‌బర్దర్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా అన్ని చోట్ల పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. గంజాయి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఎస్పీ ఇప్పటికే పలు సంఘాలతో సమావేశాలు ఏర్పాటు చేశారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లను అలర్ట్ చేశారు. దీంతో ఆదివారం జిల్లాలోని గంజాయి ప్రభావిత ప్రాంతాల్లో పోలీసులు తనిఖీలు చేపట్టారు. జిల్లా కేంద్రానికి వచ్చిపోయే అన్ని మార్గాల్లో పోలీసులు బలగాలు, జాగిలాలతో వాహన తనిఖీలు చేపట్టారు. వాహనాలను, ప్రయాణికుల బ్యాగులను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రతి రోజు ఈ తనిఖీలు కొనసాగుతాయని వారు తెలిపారు. గంజాయి సాగు చేయడం, విక్రయించడం, సేవించడం చట్టరీత్యా నేరమని ఎక్కడైనా గంజాయి వెలుగు చూస్తే నేరుగా సమాచారం తమకు ఇవ్వాలని పోలీసులు సూచిస్తున్నారు.

### బైక్‌ను ఢీకొన్న పాలవ్యాన్

- వ్యక్తి మృతి



పాంగి రాంబాబు మృతదేహం

పాడేరు : పాడేరు–చోడవరం ప్రధాన రహదారి ఘాట్‌లోని వంట్లమామిడి సమీపంలో మలుపు వద్ద ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని పాల వ్యాన్ ఢీకొట్టింది. ఈ సంఘటనలో గిరిజనుడు మృతి చెందాడు. మండలంలోని కొత్త పాడేరు గ్రామానికి చెందిన పాంగి రాంబాబు ఆదివారం ఉదయం 11గంటల సమయంలో ద్విచక్ర వాహనంపై మైదాన ప్రాంతం నుంచి పాడేరు వస్తున్నాడు. ఏజెన్సీ నుంచి విశాఖపట్నం వెళ్తున్న పాల వ్యాన్ వంట్లమామిడి మలుపు వద్ద అతడిని ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయపడిన రాంబాబు సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. ఈ సంఘటనపై పాడేరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# చదివేదెలా..?

- ప్రభుత్వ బడుల్లో ఉపాధ్యాయుల కొరత
- విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టుగా లేక ఇబ్బందులు
- 452 పాఠశాలల్లో ఒకొక్కరే దిక్కు
- మొక్కుబడిగా బోధన
- ఆందోళన వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి దాదాపు రెండు మాసాలవుతున్నా విద్యా వ్యవస్థపై దృష్టి సారించకపోవడంతో బోధన మొక్కుబడిగా సాగుతోంది. జిల్లాలోని మండల పరిషత్ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టుగా ఉపాధ్యాయులు లేకపోవడంతో చదువులు సాగడం లేదు. ఉన్న ఉపాధ్యాయులపై అదనపు భారం పడుతోంది. జిల్లాలో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు మొత్తం 1625 ఉండగా వీటి పరిధిలో 60,392 మంది విద్యార్థులు ఉన్నారు. విద్యార్థుల సంఖ్యను బట్టి 3,148 మంది ఉపాధ్యాయులు అవసరం. అయితే వీరిలో 2646 మంది మాత్రమే ఉన్నారు. వివిధ కేటగిరీలకు చెందిన 502 పోస్టులు భర్తీ చేయాల్సి ఉంది. ఇలా ఉపాధ్యాయుల కొరత ప్రభావం బోధనపై చూపిస్తోందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సాక్షి,పాడేరు: జిల్లాలో మండల పరిషత్ పాఠశాలలు ఉపాధ్యాయుల కొరతను ఎదుర్కొంటున్నాయి. విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టుగా లేకపోవడం వల్ల బోధన సాగడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో 1517 ప్రాథమిక, 108 ప్రాథమికోన్నత పాఠశాలలు ఉన్నాయి. ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను బట్టి ఇద్దరు నుంచి ముగ్గురు ఉపాధ్యాయులు ఉన్నారు.

**దయనీయ స్థితిలో ప్రాథమిక విద్య**

ప్రాథమిక పాఠశాలల్లో పరిస్థితి దయనీయంగా ఉంది. సుమారు 452 పాఠశాలల్లో ఐదు తరగతులకు ఒకొక్క ఉపాధ్యాయుడు మాత్రమే ఉన్నారు. వీరు అత్యవసర పరిస్థితుల్లో సెలవు పడితే పక్క పాఠశాల నుంచి ఉపాధ్యాయుడిని సర్దుబాటు చేసే పరిస్థితి కూడా లేదు. దీనివల్ల ఆ రోజు పాఠశాల మూతపడాల్సిన దుస్థితి నెలకొంది.

- జలగలపాడు, పులుసుమామిడి గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలల్లో సింగిల్ టీచర్లు పనిచేస్తున్నారు. వారు వ్యక్తిగత పనులపై సెలవు పెడితే పాఠశాలలు మూతబడే పరిస్థితి నెలకొంది.

**ఒక్క ఉపాధ్యాయుడిపై ఎన్నో బాధ్యతలు**

ఒక్క ఉపాధ్యాయుడు ఉన్న పాఠశాలలో బోధన పరంగా వారు సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఐదు తరగతులకు సంబంధించి అన్ని సబ్జెక్టులు ఆ ఒక్క ఉపాధ్యాయుడు బోధించాల్సిన పరిస్థితి. అంతేకాకుండా హెచ్‌ఎం బాధ్యతలు నిర్వహించాలి. మండల స్థాయి సమావేశాలు, శిక్షణ కార్యక్రమాలకు కూడా హాజరు కావాలి. దీనివల్ల బోధన మొక్కుబడిగా సాగుతున్న పాఠశాలలు లేకపోలేదు. మరోపక్క మధ్యాహ్న భోజన పథకం రికార్డుల నిర్వహణ, పర్యవేక్షణ బాధ్యతలు ఆ ఒక్కడి ఉపాధ్యాయుడిపై ఉంటుంది. రికార్డులు నిర్వహించడంతోపాటు నెలకోసారి తల్లిదండ్రుల సమావేశం నిర్వహించాలి. అంతేకాకుండా విద్యాకానుక కిట్లకు సంబంధించి విద్యార్థుల యూనిఫాం, బూట్ల కొలతలు తీసుకోవాలి. ఈ పరిస్థితుల్లో విద్యార్థుల సంఖ్యను బట్టి కాకపోయినా ప్రాథమిక పాఠశాలకు కనీసం ఇద్దరు ఉపాధ్యాయులు ఉండాలి. ఈ విషయాన్ని విద్యాశాఖ పట్టించుకోవడం లేదు. జిల్లావ్యాప్తంగా 502 ఎస్‌జీటీ పోస్టుల ఖాళీలు భర్తీ చేయాల్సి ఉందని అధికారవర్గాల ద్వారా తెలిసింది.

**పూర్తికాని బ్యాగ్‌ల పంపిణీ**

విద్యాసంవత్సరం ప్రారంభమై దాదాపుగా 45 రోజులు గడుస్తున్నా పూర్తిస్థాయిలో బ్యాగ్‌ల పంపిణీ పూర్తికాలేదు. జిల్లాలోని 22 మండలాల్లో ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి 1,66,980 బ్యాగులు మాత్రమే మండల విద్యాశాఖకు అందాయి. కొయ్యూరు, గంగవరం, రాజవొమ్మంగి మండలాల పరిధిలోని పాఠశాలల్లో పంపిణీ పూర్తికాలేదు. దీంతో ఆయా ప్రాంతాల విద్యార్థులు సొంత బ్యాగులతోనే పాఠశాలలకు వెళ్తున్నారు.



జీకే వీధి మండలంలో ఒకే ఒక ఉపాధ్యాయుడితో నడుస్తున్న సంపంగిగొంది పాఠశాల

**జిల్లా సమాచారం**

| | |
|---|---|
| ప్రాథమిక పాఠశాలలు : | 1517 |
| విద్యార్థులు : | 55,334 |
| ప్రాథమికోన్నత పాఠశాలలు : | 108 |
| విద్యార్థులు : | 5058 |
| ప్రస్తుతం ఉన్న ఉపాధ్యాయులు : | 2646 |
| కావాల్సిన ఉపాధ్యాయులు : | 502 |
| ఒక్క ఉపాధ్యాయుడు ఉన్న పాఠశాలలు : | 452 |



రాజవొమ్మంగిలో సొంత బ్యాగులతో పాఠశాలకు వెళుతున్న విద్యార్థినులు

### ఒక్క టీచర్‌తో ఇబ్బందులు

తమ పంచాయతీ పరిధిలోని జలగలపాడు, పులుసుమామిడి ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టుగా ఉపాధ్యాయులను నియమించాలి. ప్రస్తుతం ఒకొక్క ఉపాధ్యాయుడు మాత్రమే ఉన్నారు. వీరు సెలవు పెడితే ఆయా పాఠశాలలు మూత పడాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. ప్రతి పాఠశాలకు ఇద్దరు టీచర్లను నియమించి ప్రాథమిక విద్యను పటిష్టం చేయాలి.

– కిల్లు కృష్ణ, దేవాపురం పంచాయతీ, పాడేరు మండలం

### టీచర్లను సర్దుబాటు చేస్తున్నాం

జిల్లాలో విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉండి ఒక్క ఉపాధ్యాయుడు ఉన్న చోట ఏ ఇబ్బందులు ఉన్నా వెంటనే స్పందిస్తున్నాం. సమీపంలోని పాఠశాల నుంచి ఉపాధ్యాయుడిని సర్దుబాటు చేస్తున్నాం. పాఠశాల మూతబడే పరిస్థితి లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఖాళీ టీచర్ పోస్టుల భర్తీకి ప్రభుత్వానికి నివేదించాం. స్కూల్ బ్యాగ్‌ల పంపిణీ త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నాం.

– పి.బ్రహ్మాజీరావు, డీఈవో, పాడేరు

### పాలనురగల పరవళ్లు



కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు తారాబు జలపాతం పాల నురగను తలపిస్తూ పరవళ్లు తొక్కుతోంది. ఈ అందాలను తిలకించేందుకు దూర ప్రాంతాల నుంచి పర్యాటకులు తరలివస్తున్నారు. ఫొటోలు, సెల్ఫీలు తీసుకుంటూ సందడి చేస్తున్నారు.

– పెదబయలు/ముంచంగిపుట్టు

### సింహగిరిపై ప్రత్యేక పూజలు

సింహాచలం (విశాఖ): శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారిపై ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టింపజేసి విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం జరిపారు. కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం అందజేశారు.

**వైభవంగా అమావాస్య తిరువీధి**

అమావాస్య పురస్కరించుకుని శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం సాయంత్రం తిరువీధి వైభవంగా జరిగింది.

## దారికాసిన మృత్యువు

- బైక్‌లు ఢీకొని పర్యాటకుడి మృతి
- ఇద్దరికి గాయాలు
- అరకు అందాలను తిలకించి వెళ్తుండగా ప్రమాదం
- మృతుడు వైఎస్సార్ కడప వాసి



ఘటన స్థలంలో ఉపేంద్రవర్మ మృతదేహం

హుకుంపేట: అరకు అందాలు తిలకించేందుకు వచ్చిన పర్యాటకుడిని మృత్యువు దారికాసి రోడ్డు ప్రమాదరూపంలో కబళించింది. మండలంలో గడుగుపల్లి వద్ద ఆదివారం చోటుచేసుకున్న ఈ దుర్ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. వైఎస్సార్ కడపకు చెందిన చమర్తి ఉపేంద్ర వర్మ(44) ఏజెన్సీ అందాలను తిలకించేందుకు అరకు వచ్చారు. అక్కడి నుంచి ఆయన బైక్‌పై పాడేరు బయలుదేరారు. మండలంలోని పాతకోట పంచాయతీ పనసపుట్టుకు చెందిన చెట్టి చందు, రామన్న బైక్‌పై స్వగ్రామానికి వెళ్తున్నారు. ఎదురెదురుగా వస్తున్న వీరిద్దరి బైక్‌లు గడుగుపల్లి వద్దకు వచ్చేసరికి ఢీకొన్నాయి. దీంతో ఉపేంద్ర వర్మ సంఘటన స్థలంలోనే మృతి చెందాడు.గాయపడిన చందు, రామన్నను స్థానికులు పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పాడేరు ఆస్పత్రికి తరలించారు.

## వాగులు దాటెళ్లి వైద్యసేవలు



వాగు దాటి వెళుతున్న సప్పర్ల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సందీప్

గూడెంకొత్తవీధి: మారుమూల గ్రామాల్లో వైద్యసేవలందించేందుకు వైద్యాధికారులు, సిబ్బంది సాహసమే చేయాల్సి వస్తోంది. మండలం ఒడిశా సరిహద్దును ఆనుకుని ఉంది. ప్రధానంగా గాలికొండ, అమ్మవారి ధారకొండ పంచాయతీల్లో మారుమూల గ్రామాలకు నేటికీ సరైన రహదారి, రవాణా సదుపాయాలు లేవు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో వైద్యసిబ్బంది గ్రామాలకు వెళ్లి వైద్యసేవలందించాలంటే ప్రమాదకరమైన వాగులు దాటాల్సిన పరిస్థితి. ఆదివారం సప్పర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని మారుమూల ఉన్న గొల్లపల్లిలో గిరిజనులకు వైద్యసేవలందించేందుకు వైద్యాధికారి సందీప్‌తో పాటు సిబ్బంది బయలు దేరారు. సగం వరకూ అంబులెన్సులో వెళ్లారు. మార్గం మధ్యలో పొంగి ప్రవహిస్తున్న పెద్దవాగును వారు గ్రామస్తుల సహకారంతో దాటి వెళ్లారు. జ్వరాలు, వ్యాధులతో బాధపడుతున్న గిరిజనులకు వైద్యసేవలు అందించారు.

## పర్యాటక ప్రాంతాల్లో సండే సందడి



సుంకరమెట్ట కాఫీ తోట వద్ద వాహనాల రద్దీ

అరకులోయ రూరల్: ప్రముఖ పర్యాటక కేంద్రమైన గాలికొండ వ్యూ పాయింట్ వద్ద ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. మైదాన ప్రాంతం నుంచి ప్రత్యేక వాహనాల్లో భారీగా తరలివచ్చారు. ప్రకృతి అందాలను వీక్షించారు. అరకు– విశాఖ ప్రధాన రహదారిలో సుంకరమెట్ట కాఫీతోట వద్ద ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. దీంతో కొద్దిసేపు వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

దుంబ్రిగుడ: ప్రముఖ పర్యాటక కేంద్రం చాపరాయి జలవిహారిలో ఆదివారం పర్యాటకులతో సందడి నెలకొంది. గత రెండు వారాలుగా ఏజెన్సీ వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో చాపరాయి గడ్డ పొంగి ప్రవహిస్తోంది. ఈ అందాలను తిలకించేందుకు పర్యాటకులు మైదాన ప్రాంతం నుంచి తరలివస్తున్నారు. అయితే ఉధృతంగా జలపాతం ప్రవహిస్తున్నందున పర్యాటకులను అనుమతించలేదు. దీంతో వారు నిరాశ చెందారు.



వ్యూపాయింట్ వద్ద పర్యాటకుల సందడి

## నలుగురు చిన్నారుల మృతి

- వారం రోజుల వ్యవధిలో మరణాలు
- నాటుమందు వేయించడమే కారణమంటున్న వైద్య ఆరోగ్యశాఖ అధికారులు



బొడ్డుగూడెంలో మృతిచెందిన చిన్నారి వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

చింతూరు : మండలంలో వివిధ కారణాలతో వారంరోజుల వ్యవధిలో నలుగురు చిన్నారులు మృతిచెందారు. వివరాలిలా ఉన్నాయి. వారం రోజుల క్రితం గంగన్నమెట్టకు చెందిన సున్నం దుర్గారావు బిడ్డ అస్వస్థతకు గురికాగా భద్రాచలంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స అనంతరం రంపచోడవరం ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతిచెందినట్లు సింగన్నగూడెంకు చెందిన కన్నారావు తెలిపాడు.

- మండలంలోని చదలవాడకు చెందిన సొందల దేవిరెడ్డి, భద్రమ్మల రెండునెలల బిడ్డకు జ్వరం రావడంతో బుధవారం చింతూరు ఏరియా ఆస్పత్రికి తీసుకువచ్చారు. శుక్రవారం పరిస్థితి విషమించడంతో భద్రాచలంలో ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతిచెందింది.
- బొడ్డుగూడెంకు చెందిన చిలకమ్మ అనే గిరిజన మహిళ నాలుగు నెలల బాబు అస్వస్థతకు గురికావడంతో చింతూరు ఏరియా ఆస్పత్రికి శనివారం తీసుకువచ్చింది. పరిస్థితి విషమంగా ఉండటంతో ఇక్కడి వైద్యులు భద్రాచలం ప్రభుత్వాస్పత్రికి రిఫర్ చేశారు. ఈ మేరకు 108లో తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతిచెందాడు.

**ఊపిరి లేకున్నా వైద్యం చేశారు..**

- మండలంలోని సింగన్నగూడెంకు చెందిన కన్నారావు, నాంచారమ్మల మూడునెలల బాబు కూడా శనివారం భద్రాచలంలో చికిత్సపొందుతూ మృతిచెందాడు. ప్రైవేటు ఆస్పత్రి వైద్యులు నిర్లక్ష్యంవల్లే మృతిచెందాడని, తమ బిడ్డకు ఊపిరి లేకున్నా వైద్యం చేశారని వారు ఆరోపించారు. మూడు నెలల తమ బిడ్డకు అస్వస్థతగా ఉండటంతో గురువారం భద్రాచలంలోని ఓ ప్రైవేటు చిన్నపిల్లల ఆస్పత్రిలో చేర్పించామని తెలిపారు. రెండ్రోజుల పాటు అక్కడే వైద్యం చేశారన్నారు. కాగా శనివారం ఉదయం 11 గంటల సమయంలో మీబిడ్డ పరిస్థితి విషమంగా ఉందని, వేరే ఆస్పత్రికి తీసుకెళ్లాలని చెప్పడంతో తాము పక్కనేవున్న మరో ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లామని వారు తెలిపారు. అక్కడ సాయంత్రం నాలుగు గంటల వరకు తమ బిడ్డకు వైద్యం అందిస్తూనే ఉన్నారని, ఈ క్రమంలో తమకు అనుమానం వచ్చి వైద్యులను గట్టిగా ప్రశ్నించగా వారు పరీక్షించి తమబిడ్డ మృతిచెందినట్లు తెలిపారని వారు కన్నీటిపర్యంతమయ్యారు.

### నాటువైద్యం వల్లే మరణాలు

చదలవాడకు చెందిన తల్లిదండ్రులు తమ బిడ్డకు రెండ్రోజుల పాటు చింతూరు ఏరియా ఆస్పత్రిలో వైద్యం చేయించిన అనంతరం బయటకు తీసుకెళ్లి నాటుమందు వేయించారు. బొడ్డుగూడెంకు చెందిన నాలుగు నెలల మగ శిశువుకు జ్వరంతో ఉండగా నాటుమందు వేయించారు. ఈ ఇద్దరు చిన్నారులకు శ్వాస సమస్య తలెత్తి మృతిచెందారు. సింగన్నగూడెంకు చెందిన మూడు నెలల బాబుకు నిమోనియా వల్ల భద్రాచలంలోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. గ్రామాల్లో వెజ్జోళ్ల మాటలు నమ్మి నాటువైద్యం చేయించడంతోనే చిన్నారుల మరణాలు సంభవిస్తున్నాయి.

– డాక్టర్ పుల్లయ్య, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో, చింతూరు

### 'కోడ్' అమలు ఇలాగేనా?

- అధికార పార్టీ ఫ్లెక్సీలను తొలగించని అధికారులు



అరకులో వైఎస్ విగ్రహానికి వేసిన ముసుగు, పక్కనే తొలగించని అధికార పార్టీ ఫ్లెక్సీ



అరకులోయలోని ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్డులో తొలగించని కూటమి ఫ్లెక్సీ

అరకులోయ రూరల్: మండల కేంద్రం అరకులోయలో ఎమ్మెల్సీ ఉప ఎన్నికల ఎన్నికల కోడ్ అమలులో పంచాయతీ, మండల పరిషత్ అధికారుల తీరు విమర్శలకు తావిస్తోంది. రెండురోజుల క్రితం పంచాయతీ అధికారులు వివిధ ప్రధాన కూడళ్లలో రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు తొలగించి, నేతల విగ్రహాలకు ముసుగులు వేశారు. అయితే ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్డు జంక్షన్‌లో ఉన్న అధికార పార్టీకి చెందిన ఫ్లెక్సీలు మాత్రం తొలగించకపోవడాన్ని పలువురు విమర్శిస్తున్నారు.

## మద్యం దుకాణంలో అగ్ని ప్రమాదం

- చెలరేగిన మంటలు
- నష్టం వివరాలు వెల్లడించకపోవడంపై అనుమానాలు



మంటల్లో కాలిపోతున్న మద్యం బాటిళ్లు

అడ్డతీగల: మండల కేంద్రమైన అడ్డతీగలలో ప్రభుత్వ మద్యం దుకాణం దగ్ధమైంది. ఈ ప్రమాదానికి షార్ట్ సర్క్యూట్ కారణమని సిబ్బంది చెబుతున్నారు. అయితే స్థానికుల నుంచి పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అడ్డతీగలలో రెండు ప్రభుత్వ మద్యం దుకాణాలు ఉన్నాయి. వీటిలో అంబేడ్కర్ విగ్రహానికి ఎదురుగా ఉన్న రెండవ దుకాణంలో ఆదివారం ఉదయం ఈ ప్రమాదం సంభవించింది. దుకాణంలోని రెండు గదుల్లో సుమారు రూ.9 లక్షల విలువైన మద్యం బాటిళ్లు ఉన్నాయి. వీటిలో సుమారు.4 లక్షల విలువైన మద్యం బాటిళ్లు ఉన్న మొదటి గదిలో మంటలు చెలరేగాయి. వెంటనే పరిసర ప్రాంతీయులు మంటలను అదుపులోకి తెచ్చారు. ప్రమాద సమాచారం తెలుసుకున్న ఎక్సైజ్ ఎస్‌ఐ ఖాదర్ బాషా దుకాణం వద్దకు వచ్చారు. జరిగిన నష్టాన్ని పరిశీలించారు. ఆ వివరాలను మీడియాకు తెలియజేసేందుకు నిరాకరించారు. సాయంత్రం రెవెన్యూ అధికారులు పరిశీలించారు. ప్రమాదం ఎలా జరిగిందనేది విద్యుత్ శాఖ అధికారులు నిర్ధారించాల్సి ఉందని, ఏమేర మద్యం బాటిళ్లకు నష్టం జరిగిందనేది ఎక్సైజ్ అధికారుల ప్రకటించాల్సి ఉందని వారు తెలిపారు.

## ఉత్సాహంగా జాతీయ స్థాయి కరాటే పోటీలు

పెదగంట్యాడ (విశాఖ): అమరపిని యాన్సెంట్ షాటోకాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక బీసీ రోడ్డులోని అగ్నికుల క్షత్రియ కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన 3వ జాతీయ స్థాయి ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఈ పోటీల్లో 9 రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున క్రీడాకారులు హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్ నుంచి ఆంధ్ర షాటో కాన్ జట్టు ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకోగా తెలంగాణకు చెందిన డ్రాగన్ షాటో కాన్ కరాటే డూ స్పోర్ట్స్ ద్వితీయ స్థానంలో నిలిచింది. విజేతలకు బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు బహుమతులు అందజేశారు. పోటీలను గాజువాక మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, 65వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నర్సింహపాత్రుడు ప్రారంభించారు. అమరపిన్ని నరేంద్ర, అమరపిన్ని మనోహర్ సాయి పర్యవేక్షణలో పోటీలు నిర్వహించారు.

## క్లుప్తంగా

### విద్యారంగం అభివృద్ధిలో 'కూటమి' విఫలం



ఎస్‌ఎఫ్‌ఐ జిల్లాస్థాయి ప్లీనరీ సమావేశంలో మాట్లాడుతున్న రామ్మోహన్

**అనకాపల్లి:** రాష్ట్రంలో విద్యారంగాన్ని అభివృద్ధి చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామ్మోహన్ అన్నారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్లీనరీ సమావేశాలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విద్యార్థులు ఇతర రాష్ట్ర విద్యార్థులతో పోటీపడాలంటే ప్రాథమిక స్థాయి నుంచి నైపుణ్యాన్ని పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగాఉన్న ఉపాధ్యా యుల పోస్టులను వెంటనే భర్తీచేసి, నాణ్యమై న విద్యను అందించాలని, అనకాపల్లిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మామడి రమణ, గిడుతూరు గీతాకృష్ణ, జిల్లా నాయకులు కేశవ, శ్రీను, వెంకటేష్, కృపానంద్, దివాకర్, జనార్ధన్ పాల్గొన్నారు.

### ఎన్‌సీసీ క్యాడెట్ల బాక్సింగ్ పోటీలకు దిమిలి విద్యార్థి

**అచ్యుతాపురం:** ముంబయిలో ఈ నెల 13న నిర్వహించనున్న ఎన్‌సీసీ క్యాడెట్ల బాక్సింగ్ పోటీలకు రాంబిల్లి మండలం దిమిలి విద్యార్థి అనగాని ధనుష్ ఎంపికయ్యాడు. ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాలలో చదువుతున్న ధనుష్ విశాఖపట్నం గ్రూప్ నుంచి ఎంపికైనట్టు ప్రశాంతి విద్యాసంస్థల ప్రిన్సిపాల్ అప్పలనాయుడు తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిస్తే ఇండియన్ నేవీలో నేరుగా ఉద్యోగం పొందవచ్చు.

### గెస్ట్ లెక్చరర్ల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

**నర్సీపట్నం:** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి గెస్ట్ లెక్చరర్ల నియామకానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రాజు తెలిపారు. కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్, ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేసేందుకు ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. కెమిస్ట్రీ లెక్చరర్ పోస్టు భర్తీకి ఎంఎస్సీ 55 శాతం ఉత్తీర్ణత కలిగిన వారికి ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఎంఎస్సీ కంప్యూటర్ సైన్స్, ఎంసీఏ, ఎంటెక్ కంప్యూటర్ సైన్స్ అర్హత గల వారికి కంప్యూటర్ సైన్స్ లెక్చరర్ పోస్టు భర్తీకి ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఎంపీఈడీ 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన వారు ఫిజికల్ డైరెక్టర్ పోస్టుకు అర్హులని తెలిపారు. అభ్యర్థులు ఈ నెల 7వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా కాలేజీలో దరఖాస్తులను సమర్పించాలని తెలిపారు. 9వ తేదీ ఉదయం 10 గంటలకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూకు హాజరు కావాలని చెప్పారు.

# గుండెలదిరినై..



కోర్బా ఎక్స్‌ప్రెస్ కోచ్‌ల్లో మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది, రైల్వే సిబ్బంది

- 6.30 గంటలకు రైల్వే స్టేషన్‌కు వచ్చిన కోర్బా-విశాఖ ఎక్స్‌ప్రెస్
- 9.40 గంటలకు అగ్నికీలల్లో బూడిదైన బీ-7, మరో రెండు కోచ్‌లు
- ప్రయాణికులు లేకపోవడంతో ఊపిరి పీల్చుకున్న విశాఖ
- పవర్ సప్లయ్ లేకపోయినా ప్రమాదమెలా జరిగింది?
- ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీమ్
- నేడు ఆర్‌డీఎస్‌వో, ఐసీఎఫ్ బృందాల పరిశీలన

సాక్షి, విశాఖపట్నం :

సాగరాన్ని చీల్చుకుంటూ.. సూరీడు రాకతో విశాఖ నిద్రలేచింది.

నిరంతరం సందడిగా ఉండే వాల్తేరు రైల్వేస్టేషన్ ఎప్పటిలాగానే ప్రయాణికులతో కిటకిటలాడుతోంది.

అప్పుడే నాలుగో నంబర్ ప్లాట్‌ఫారానికి వచ్చిన కోర్బా-విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్ నుంచి ప్రయాణికులు దిగి ఇళ్లకు వెళ్లిపోయారు.

మధ్యాహ్నం మళ్లీ తిరుపతి వెళ్లేందుకు రెడీ చేయాలనే ఉద్దేశంతో సిబ్బంది రైలును శుభ్రం చేస్తున్నారు.

ఉదయం 9.40 గంటలకు కలకలం మొదలైంది..

బీ-7 థర్డ్ ఏసీ కోచ్ నుంచి పొగలు వస్తున్నట్లు పహారా కాస్తున్న ఆర్‌పీఎఫ్ సిబ్బంది గుర్తించారు.





ప్రమాదంలో పూర్తిగా కాలిపోయిన బి-7కోచ్ బెర్తులు

కోచ్ దగ్గరికి సిబ్బంది చేరుకునేలోపే.. మంటలుగా చెలరేగి కోచ్ మొత్తం వ్యాపించాయి.

5వ నంబర్ ప్లాట్‌ఫాం వద్ద రైలు కోసం ఎదురు చూస్తున్న ప్రయాణికులు భయభ్రాంతులకు గురై పరుగులు తీశారు.

వెంటనే అప్రమత్తమైన సిబ్బంది మంటలు ఆర్పేందుకు యత్నించారు. కానీ ఫలితం లేదు. 10.10 గంటలకు ఫైర్ బ్రిగేడ్స్ చేరుకున్నాయి.

ఇంతలోనే బీ-7కి ఇటు అటు ఉన్న బీ-6, ఎం-1 కోచ్‌లకు మంటలు వ్యాపించేశాయి. ఓ వైపు అగ్నిమాపక సిబ్బంది, మరోవైపు ఆర్‌పీఎఫ్ సిబ్బంది మంటల్ని అదుపులోకి తీసుకొచ్చేందుకు శ్రమించారు.

దాదాపు 2 గంటల తర్వాత మంటలు పూర్తిగా అదుపులోకి రావడంతో ఊపిరి పీల్చుకున్నారు.

ప్రమాదం జరిగినప్పుడు రైలులో ప్రయాణికులెవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.



ప్రమాదస్థలిని పరిశీలిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి



కొత్త బి-7 కోచ్‌తో మధ్యాహ్నం 2.15 గంటలకు బయల్దేరిన తిరుమల ఎక్స్‌ప్రెస్



బీ7 కోచ్‌లో ఎగిసిపడుతున్న మంటలు

### మెయింటెనెన్స్ లోపమా.?

వాస్తవానికి ఎల్‌హెచ్‌బీ కోచ్‌ల మెయింటెనెన్స్ ఈ మధ్య సరిగా ఉండటం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రైవేట్ సంస్థకు ఈ బాధ్యతలు అప్పగించినప్పటి నుంచి కోచ్‌ల పరిశుభ్రత, నిర్వహణ విషయంలో కాస్తా అలసత్వం ప్రదర్శిస్తున్నారనీ.. దీనిపై ఫిర్యాదులు చేస్తున్నా రైళ్లలో ఉండే ప్రైవేట్ సిబ్బంది పట్టించుకోవడం లేదన్న విమర్శలొస్తున్నాయి. విద్యుత్ వ్యవస్థ నిర్వహణలో ఉదాసీనంగా ఉండటం వల్లే లోపల షార్ట్ సర్క్యూట్ జరిగి నెమ్మదిగా మంటలు వ్యాపించి ఉంటాయేమోనన్న వాదనా వినిపిస్తోంది..

### అంతలోనే మంటలు



– ప్రత్యక్ష సాక్షి

మేము ఈ ప్లాట్‌ఫాంపై పనిచేస్తుంటాం. ఎదురుగా పొగ వస్తోందని మాట్లాడుకుంటుంటే అక్కడికి వెళ్లాం. అంతలోనే మంటలు వ్యాపించాయి. జనాలు ఒక్కసారిగా పరిగెత్తారు. పోలీసులు, ఫైర్ వాళ్లు వచ్చి మంటల్ని అదుపు చేయడానికి తీవ్రంగా శ్రమించారు.

### భయపడిపోయాం..



– ప్రత్యక్ష సాక్షి

మంటలొస్తున్నాయని చెబుతుంటే అక్కడికి వెళ్లాం.. ట్రైన్ మొత్తం తగలబడిపోతున్నట్లు కనిపించింది. మేం సాయం చేయాలని ప్రయత్నించాం. కానీ.. పోలీసులు ఆపేశారు.

### పవర్ లేనప్పుడు ప్రమాదమెలా జరిగింది?

ఉదయం 6.30 గంటలకు కోర్బా-విశాఖపట్నం (18517) ఎక్స్‌ప్రెస్ విశాఖ చేరుకుంది. 7.30 గంటలకు ట్రైన్‌కు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. కోచింగ్ డిపోకు ఈ ఖాళీ రైలును పంపించే ముందు.. ఏసీ కోచ్‌ల్లో ఉన్న బ్లాంకెట్స్ తీసివేయడం, లైట్లు, ఫ్యాన్స్ స్విచ్‌లు ఆపడం, స్లీపర్, జనరల్ కోచ్‌ల్లో విండో గ్లాస్‌లు దించే పని ప్రారంభించారు. ప్రమాదం జరిగింది ఉదయం 9.40 గంటలకు. అంటే దాదాపు రెండు గంటల ముందే ట్రైన్‌కు పవర్ సప్లయ్ నిలిచిపోయింది. కానీ బీ-7 థర్డ్ ఏసీ కోచ్ నుంచి మంటలు వ్యాపించడంపై అందర్లోనూ అనుమానాలు కలుగుతున్నాయి. షార్ట్ సర్క్యూట్ అయ్యే ఛాన్స్‌లేదు. కానీ అగ్ని ప్రమాదం ఎలా జరిగిందో అధికారులకు అంతు చిక్కడం లేదు. చివర్లో ఎవరైనా ఆకతాయిలు దిగినప్పుడు సిగరెట్ తాగి పడేశారా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. కొన్ని ఎల్‌హెచ్‌బీ కోచ్‌లలో ఇప్పటికే సీసీ కెమెరాలు అందుబాటులోకి వచ్చాయి. కానీ ఈ ఎక్స్‌ప్రెస్‌లో మాత్రం సీసీ కెమెరాలు లేకపోవడంతో అధికారులు లోతుగా దర్యాప్తు చేయాల్సి ఉంటుంది.

### నేడు దర్యాప్తు బృందాల రాక

ప్రమాదం ఎలా జరిగిందన్న దానిపై ఇంత వరకూ ప్రాథమిక అంచనాకు రాలేదని వాల్తేరు డివిజన్ అధికారులు చెబుతున్నారు. మంటలు పూర్తిగా అదుపులోకి వచ్చిన తర్వాత ప్రమాదానికి గురైన కోచ్‌లను కూడా మెయింటెనెన్స్ డిపోకి తరలించారు. ప్రమాదం గురించి తెలుసుకున్న డీఆర్‌ఎం సౌరబ్‌ప్రసాద్, నగర పోలీస్ కమిషనర్ శంకబ్రత బాగ్చి, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, ఏడీఆర్‌ఎం మనోజ్‌కుమార్ సాహూ, ఇతర రైల్వే అధికారులు ఘటనా స్థలికి చేరుకొని సమీక్షించారు. ప్రమాదంపై విచారణ నిర్వహించి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. క్లూస్ టీమ్ చేరుకొని ఆధారాలు సేకరించే పనిలో నిమగ్నమైంది. లక్నోలో ఉన్న రీసెర్చ్ డిజైన్స్ అండ్ స్టాండర్డ్స్ ఆర్గనైజేషన్(ఆర్‌డీఎస్‌వో), చెన్నై నుంచి ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ(ఐసీఎఫ్) బృందాలు సోమవారం వచ్చి ఆధారాలు సేకరించనున్నాయి. అదేవిధంగా ప్రమాదంపై విచారణ చేపట్టేందుకు ఈస్ట్‌కోస్ట్ రైల్వే జోన్ అధికారులు విశాఖకు సోమవారం రానున్నారు.

# రామకథను వినరయ్యా..



రామాయణంలో ఓ ఘట్టం

- విదేశీ విద్యార్థుల నోట రాముని పాట
- రామాయణ ఘట్టాలపై అద్భుత నృత్య ప్రదర్శన

**బీచ్‌రోడ్డు:** శభాష్.. పాత్రధారణ అంటే ఇలా ఉండాలి! అందం, హావభావాలతో వారు సీతారాములను తలపించారు. రాముడు, సీత జననం, వారి బాల్యం, విద్యాభ్యాసం, స్వయంవరం, 14 ఏళ్ల వనవాసం, రావణుడిపై విజయం లాంటి సన్నివేశాలతో విదేశీ విద్యార్థులు అబ్బురపరిచారు. విదేశీ విద్యార్థులు రామాయణ ఘట్టాలను అవగతం చేసుకుని ఆయా పాత్రలో ఒదిగిపోయారు. ఆద్యాంతం అద్భుతంగా నటించి మెప్పించారు. రామాయణంలోని దాగి ఉన్న సంస్కృతీసంప్రదాయలను పాట..నృత్య రూపంలో విదేశీ విద్యార్థుల ప్రదర్శన అద్భుతంగా సాగింది. ప్రపంచ వ్యాప్తంగా భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను ప్రచారం చేసేందుకు ఇండియన్ కౌన్సిల్ ఫర్ కల్చరల్ రిలేషన్స్, సూరతి సంయుక్తంగా రామాయన్ పేరుతో సంగీత సాహిత్య ప్రదర్శనను ఆదివారం ఏయూ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ ప్రదర్శనను ఏయూ ఇంటర్నేషనల్ డీన్ ఈఎస్ ధనుంజయరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏయూలో చదువుతున్న వివిధ దేశాల విద్యార్థులకు రామాయణంలోని ఇతిహాసాలు తెలియజేసేందుకు ఈ కార్యక్రమం ఎంతో దోహదపడిందన్నారు. సూరతి వ్యవస్థాపకురాలు రిమ్లీ మాట్లాడుతూ రామాయణం ఇతిహాస సారాంశాన్ని మరో నూతన కోణంలో ప్రదర్శించడం జరిగిందన్నారు. రామాయణం అద్భుత కథాంశాన్ని అందంగా, వైవిధ్యంగా, ఒపేరా, జాజ్ , సమకాలీన సంగీత ప్రక్రియలతో ప్రదర్శించారు.

# కొబ్బరి పీచు స్టాక్ పాయింట్‌లో అగ్నిప్రమాదం

**రాంబిల్లి (యలమంచిలి) :** విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ఆదివారం జరిగిన అగ్నిప్రమాదంలో రాధా ఫైబర్స్ పరిశ్రమకు చెందిన స్టాక్ పాయింట్‌లో నిల్వ చేసిన కొబ్బరి పీచు దగ్ధమైంది. యలమంచిలి అగ్నిమాపకశాఖాధికారి రాంబాబు, పరిశ్రమ యజమాని పిన్నమరాజు రాధా సుందర సుబ్బరాజు తెలిపిన వివరాలు ... మండల కేంద్రం రాంబిల్లిలో ఉన్న రాధా ఫైబర్స్ కొబ్బరి పీచు పరిశ్రమకు చెందిన సుమారు రూ.20 లక్షలు విలువ చేసే పీచును స్థానిక పోలీస్ స్టేషన్ వెనుక ఉన్న ఒక ఖాళీ స్థలంలో నిల్వ చేశారు. కొబ్బరి పీచు మీద ఉన్న విద్యుత్ వైర్ల షార్ట్ సర్క్యూట్ కారణంగా ఆదివారం నిప్పు రవ్వలు కిందపడడంతో అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో సుమారు రూ.20లక్షల విలువ చేసే ఎండబెట్టిన కొబ్బరిపీచు దగ్ధమైంది. సమాచారం అందుకున్న యలమంచిలి అగ్నిమాపకశాఖ సిబ్బంది హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశారు.

# వరి నారుమడిలో ఉల్లికోడు తెగులు

**అనకాపల్లి :** ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు వరి నారుమడిలో ఉల్లికోడు తెగులు వచ్చే అవకాశం ఉన్నందున, నివారణకు కార్బోఫ్యూరాన్ 3 జి గుళికలను సెంటుకు 160 గ్రా.ల చొప్పున వేసుకోవాలని ప్రాంతీయ వ్యవసాపరిశోధనా స్థానం ఏడీఆర్ డాక్టర్ సీహెచ్.ముకుందరావు ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. నారుమడి నాటుకోవడానికి సిద్ధంగా ఉంటే, ఈ వర్షాలను ఉపయోగించుకొని, పచ్చిరొట్ట పైరును నేలలో కలియ దున్ని ప్రధాన పొలం తయారు చేసుకోవాలన్నారు.

**నాట్లు వేసుకునేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు...**

నాట్లు వేసుకునే రైతులు ఆకు చివరలను తుంచి 20 ఇన్‌టూ 15 సెం.మీ. దూరంలో కుదురుకు 2-3 మొక్కల చప్పున నాటుకోవాలని, ఖరీఫ్‌లో చ.మీ.కు. 33 మూనలు ఉండేలా చూసుకోవాలని తెలిపారు. నాటిన తర్వాత ప్రతి రెండు మీటర్లకు 20 సెం.మీ.బాటలు తియ్యడం వల్ల పైరుకు గాలి, వెలుతురు బాగా సోకి చీడ పీడల ఉధృతి కొంత వరకు అదుపు చేయవచ్చని, ఎరువులు, కలుపు మందులు, పురుగు మందులు వేయడానికి ఇంకా పైరు పరిస్థితి గమనించడానికి ఈ బాటలు బాగా ఉపయోగ పడతాయని అన్నారు. ఎకరాకు 35 కిలోల యూరియా, 150 కిలోల సింగిల్ సువర్ ఫాస్పెట్ 17 కిలోల మురేట్ ఆఫ్ పోటాష్ నాట్లు వేసుకునేటప్పుడు వేసుకోవాలని, ఎకారాకు 20 కిలోల జింక్ సల్ఫేట్ వేసుకోవాలని, జింక్ సల్ఫేట్ వేసినప్పుడు భాస్వరం ఎరువులతో కలపకుండా కనీసం మూడు రోజుల వ్యవధి ఉండేలా చూసుకోవాలని సూచనలు చేశారు.

**కలుపు నివారణ ఇలా...**

వర్షాల కారణంగా కలుపు సమస్య పెరిగే అవకాశం ఉందని, నివారణకు, ఎకారాకు 500మి.లీ. ప్రీటిలక్లోర్ లేదా 35 గ్రా. ఆక్సాడయార్జిల్ మందును 500 మి.లీ. నీటిలో కలిపి, ఆ ద్రవాన్ని ఎకరాకు 20 కిలోల పొడి ఇసుకలో కలిపి నాటిన 3-5 రోజుల్లో పలుచగా నీరు ఉంచి సమానంగా వెదజల్లాలన్నారు. పైరజోసల్ఫ్యూరాన్ కలుపు మందును ఎకరానికి 80-100 గ్రా.చొప్పున వరి నాటిన 8-12 రోజులకు బిస్పైరిబాక్ సోడియంను ఎకరానికి 100 మీ.లీ.ల చొప్పున వరి నాటిన 15-20 రోజులప్పుడు పిచికారి చేసి కలుపు నివారించవచ్చన్నారు.

**రాగి నాటుకోవాలంటే...**

రాగల ఐదు రోజులలో వర్ష సూచన ఉన్నందున రైతులు వర్షాన్ని ఉపయోగించుకుని చోడి (రాగి)ని నాటుకొనే రైతులు స్వల్ప కాలిక రకాలైతే 15 ఇన్ టూ 10 సెం, మీ, మధ్య కాలిక రకాలైతే 15-20 ఇన్‌టూ 15 దూరం లో నాటుకోవాలని, రాగి పైరును నాటుకునే రైతులు ఎకరాకు టన్నుల పశువుల ఎరువును వేసి ఆఖరు దుక్కిలో కలియదున్నాలని, ఎకరాకు 26 కిలోల యూరియా, 75 కిలోల సింగిల్ సూపర్ ఫాస్పేట్, 13 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌ను నాటేటప్పుడు వేసుకోవాలన్నారు.



# స్నేహితుల దినోత్సవం వేళ విషాదం

- గంభీరం రిజర్వాయర్‌లో జారిపడి విద్యార్థి మృతి

**తగరపువలస :** స్నేహితుల దినోత్సవం వేళ విషాదం నెలకొంది. సరదాగా గడిపేందుకు వెళ్లిన స్నేహితుల్లో ఒకరు కాలు జారి గంభీరం రిజర్వాయర్‌లో పడిపోవడంతో మునిగిపోయి మృతి చెందాడు. ఈ దుర్ఘటన ఆనందపురం మండలం గంభీరం రిజర్వాయర్ వద్ద జరిగింది. గీతం విద్యార్థి డోకి నిరంజన్ కాలు జారి పడిపోవడంతో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఆదివారం స్నేహితుల దినోత్సవం సందర్భంగా నిరంజన్‌తోపాటు మరో నలుగురు విద్యార్థులు ఆశిష్, రిహాన్, లలిత్, మోషిత్ సరదాగా గడపడానికి రిజర్వాయర్ వద్దకు చేరుకున్నారు. రిజర్వాయర్ మధ్యలో గట్టుపై నడుస్తుండగా నిరంజన్‌తోపాటు ఆశిష్, రిహాన్ కాలు జారి పడిపోయారు. ఆ సమయంలో అక్కడే ఉన్న స్థానికులతోపాటు మిగిలిన స్నేహితులు ఆశిష్, రిహాన్‌ను రక్షించగా నిరంజన్ మునిగిపోవడంతో మృతి చెందాడు. ఈ ప్రమాదంలో ఆశిష్‌కు గాయాలు కాగా ఆనందపురం పోలీసులు స్థానిక పీహెచ్‌సీకీ తరలించి చికిత్స చేయిస్తున్నారు. వీరంతా గీతం కళాశాలలో బీటెక్ సీఈసీ మూడో సంవత్సరం చదువుతున్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుని స్వస్థలం శ్రీకాకుళం జిల్లా పలాస. అతని తండ్రి దుస్తుల వ్యాపారం నిర్వహిస్తుంటాడు. నిరంజన్ మృతి విషయం తెలుసుకున్న స్నేహితులు గంభీరం రిజర్వాయర్ వద్దకు, ఆనందపురం పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. సీఐ టీవీ తిరుపతిరావు మృతుని కుటుంబ సభ్యులకు వివరాలు తెలియచేసి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

**6వ తరగతి విద్యార్థి మృతి**

**బీచ్‌రోడ్డు:** స్నేహితుల దినోత్సవం రోజు విషాధం చోటు చేసుకుంది. మాధవదార ప్రభుత్వ స్కూల్‌లో 6వ తరగతి చదువుతున్న బొంతల ప్రవీన్ కుమార్ (10) స్నేహితులతో కలిసి విక్టరీ ఏట్ సీ ఎదురుగా ఉన్న బీచ్‌లో సరదాగా గడిపేందుకు వచ్చారు. అంతా సముద్రంలో స్నానాలు చేస్తుండగా అలల ఉధృతికి ప్రవీన్ కొట్టుకుపోయాడు. మిగిలిన వారు కేకలు వేయడంతో దగ్గరలో ఉన్న బీచ్ లైఫ్ గార్డ్స్ ప్రవీన్ కుమార్‌ను అతి కష్టం మీద ఒడ్డుకు తీసుకొని వచ్చారు. అప్పటికే పూర్తిగా నీరు తాగడంతో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. వెంటనే కేజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

# ఓవరాల్ చాంప్ మహారాష్ట్ర

- రన్నరప్‌గా ఉత్తరప్రదేశ్
- విశాఖలో ముగిసిన జాతీయ తైక్వాండో చాంపియన్‌షిప్



కోరుగి పోటీల్లో తలపడుతున్న క్యాడెట్ తైక్వాండియన్

**విశాఖ స్పోర్ట్స్ :** జాతీయ 7వ క్యాడెట్ కోరుగి, పూమ్‌సే తైక్వాండో చాంపియన్‌షిప్ మేల్ క్యాడెట్‌లో మహారాష్ట్ర 84 పాయింట్లతో ఓవరాల్ చాంపియన్‌గా నిలవగా ఉత్తరప్రదేశ్ 81 పాయింట్లతో రన్నరప్‌గా నిలిచింది. జట్ల వారీగా సర్వీసెస్, ఫిమేల్ క్యాడెట్‌లో అసోం జట్లు విజేతలుగా నిలిచాయి. సర్వీసెస్ జట్టు 57 పాయింట్లు సాధించగా అసోం జట్టు 62 పాయింట్లతో ఆధిక్యాన్ని ప్రదర్శించి ట్రోఫీలను కై వసం చేసుకున్నాయి. మేల్ క్యాడెట్‌లో 53 పాయింట్లతో ఉత్తరప్రదేశ్ రన్నరప్‌గా, 39 పాయింట్లతో బీహార్ సెకండ్ రన్నరప్‌గా నిలవగా...ఫిమేల్ క్యాడెట్‌లో మహారాష్ట్ర 54 పాయింట్లతో రన్నరప్‌గా, ఉత్తరాఖండ్ 37 పాయింట్లతో సెకండ్ రన్నరప్‌గా నిలిచాయి. తైక్వాండో సమాఖ్య పర్యవేక్షణలో ఏపీ తైక్వాండో సంఘం ఆధ్వర్యంలో విశాఖలోని పోర్ట్ ఇండోర్ స్టేడియంలో మూడు రోజుల పాటు ఈ పోటీలు కోరుగి, పూమ్‌సేల్లో జరగ్గా 29 రాష్ట్రాలకు చెందిన తైక్వాండియన్స్ మేల్,ఫిమేల్ క్యాడెట్ పదేసి విభాగాల్లో పోటీపడ్డారు. బెస్ట్ ఫైటింగ్ స్పిరిట్‌ను మేల్ క్యాడెట్‌లో రాజస్థాన్ జట్టు ప్రదర్శించగా ఫిమేల్ క్యాడెట్‌లో తమిళనాడు జట్టు ప్రదర్శించింది. మేల్ క్యాడెట్‌లో హర్యానా జట్టు, ఫిమేల్ క్యాడెట్‌లో చండీగఢ్ జట్టు యాక్టివ్ పార్టిసిపేషన్ జట్లుగా నిలిచాయి. పోటీల ముగింపు కార్యక్రమానికి హోం మంత్రి వంగలపూడి అనిత హాజరై విజేతలకు ట్రోఫీలందించాల్సి ఉండగా ఎమ్మెల్సీ ఉప ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో హాజరుకాలేకపోయారు. దీంతో సమాఖ్య, సంఘం ప్రతినిధులే విజేతలకు ట్రోఫీలందించారు. ఏపీ తైక్వాండో సంఘం అధ్యక్షుడు పోటీలను పర్యవేక్షించగా సమాఖ్య కోశాధికారి జస్బీర్‌సింగ్, చాంపియన్‌షిప్ అబ్జర్వర్ దొరైతో పాటు సంఘం ప్రతినిధులు శ్రీను, సలాం, డీపీ చారి, లక్ష్మీనారాయణ, గణేష్,మురళీ, శేఖర్ పాల్గొన్నారు.

**స్వర్ణవిజేతలు వీరే...**

పూమ్‌సే గ్రూప్ మేల్ క్యాడెట్ ఈవెంట్‌లో అసోంకు చెందిన సిమాంతదాస్, సుమన్ ఖలితా, సామియుల్, తంగు విజేతలుగా నిలిచారు. ఫిమేల్ క్యాడెట్‌లో అరుణాచల్ ప్రదేశ్‌కు చెందిన తెర్ దిమిన్,నోవే వాంగ్‌షూ,మినక్ తముక్ విజేతలుగా నిలిచారు. మొత్తంగా పదేసి కేటగిరీల్లో కోరుగి పోటీలు జరగ్గా చివరి రోజు ఆదివారం మేల్ క్యాడెట్‌లో రచిత్ మౌర్య(ఉత్తరప్రదేశ్), హెంబా మీతి (మణిపూర్), ఫిమేల్ క్యాడెట్‌లో గర్గి భకాల్కర్ (మహారాష్ట్ర) దివ్యానా హాల్కి(అసోం) ఆయా కేటగిరీల్లో విజేతలుగా నిలిచారు.

# ఆర్టీసీ బస్సు, బైక్ ఢీకొని ఒకరు మృతి

**నాతవరం:** నర్సీపట్నం తుని మధ్య ఆర్అండ్‌బీ రోడ్డులో ఎం.బెన్నవరం గ్రామ సమీపంలో రెండవ మలుపు వద్ద ఆర్టీసీ బస్సు, బైక్ ఢీకొన్న సంఘటనలో లగుడు అప్పలనాయుడు (60) అక్కడికక్కడే మృతి చెందాడు. నాతవరం ఎస్ఐ రామారావు అందించిన వివరాలిలా ఉన్నాయి. నర్సీపట్నం మండలం అమలాపురం గ్రామానికి చెందిన లగుడు అప్పలనాయుడు ఆదివారం ఉదయం బైక్‌పై నర్సీపట్నం బయలుదేరాడు. మార్గమధ్యంలో నర్సీపట్నం నుంచి తుని వైపు వెళ్తున్న నర్సీపట్నం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అప్పలనాయుడు సంఘటన స్థలంలోనే మరణించాడు. మృతుడు అప్పలనాయుడుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడు పెద్ద కుమారుడు గంగాధర్ ఫిర్యాదు మేరకు నాతవరం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించినట్టు ఎస్ఐ తెలిపారు. ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం జరగలేదు.

# ఆధునిక జీవన శైలితో రక్తనాళాల రుగ్మతలు

- సీపీ శంఖబ్రత బాగ్చి
- బీచ్ రోడ్డులో వాస్కులర్ వాక్



వాక్‌థాన్‌ను ప్రారంభిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

**బీచ్‌రోడ్డు:** ప్రపంచంలో నేడు నెలకొన్న ఆధునిక జీవనశైలిలో ఎక్కువ మంది రక్తనాళాల రుగ్మతలకు గురవుతున్నారని నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి తెలిపారు. కనీస శారీరక సామర్థ్యం లేకపోవడం వల్ల రక్తనాళాల రుగ్మతలు వస్తున్నాయన్నారు. జాతీయ వాస్కులర్ డే సందర్భంగా వాస్కులర్ సొసైటీ ఆఫ్ ఇండియా (వీఎస్ఐ) విశాఖ ఆధ్వర్యంలో ఆదివారం వాకథాన్ నిర్వహించారు. బీచ్‌రోడ్డులోని వైఎస్సార్ విగ్రహం నుంచి ఆర్కేబీచ్ వరకు సాగిన వాక్‌థాన్‌ను సీపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవయవ తొలగింపును నివారించాల్సిన ఆవశ్యకత, దాని వల్ల కలిగే ప్రభావంపై ప్రజల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు. వాస్కులర్ -ఎండోవాస్కులర్ సర్జన్ డాక్టర్ దివాకర్ బెండి మాట్లాడుతూ రక్తనాళాల రుగ్మతలపై అవగాహన పెంచేందుకే వాక్ నిర్వహించామన్నారు. వాస్కులర్ సొసైటీ ఆఫ్ ఇండియా సెక్రటరీ డాక్టర్ తపిష్ సాహు మాట్లాడుతూ అవయవ తొలగింపు రహిత భారతదేశం కోసం కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి అద్భుత స్పందన రావడం చాలా ఆనందంగా ఉందని వాస్కులర్ సొసైటీ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ డాక్టర్ పీసీ గుప్తా అన్నారు.